
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
ఆదివారం 12 అక్టోబరు 2025



సదాశివపేట కందకం రోడ్డుకు 2014లో

రూ.20కోట్లు తెచ్చిన.. ఇప్పుడు నేనే పూర్తిచేస్తున్నా

- ఆర్అండ్‌బీ, మున్సిపల్ అధికారులతో సదాశివపేట కందకం రోడ్డు ఆవరణలో జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల సమీక్ష
- ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన రోడ్డును 11 ఏళ్లలో ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్న
- రోడ్డులో ఇళ్లు, స్థలాలు కోల్పోతున్నవారికి తగిన పరిహారం ఇవ్వలేనందుకేనని జగ్గారెడ్డి దృష్టికి తెచ్చిన అధికారులు
- ఇన్నేళ్లు ఏం చేశారని నాడు బీఆర్ఎస్‌లో ఉన్న మున్సిపల్ మాజీ చైర్మన్లు సుభాష్, విశ్వనాథ్‌ను ప్రశ్నించిన జగ్గారెడ్డి
- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను ఎన్నోసార్లు అడిగామని, ఈ కుంపటి మనకెందుకని చెప్పడంతో పట్టించుకోలేదని జవాబిచ్చిన మాజీ చైర్మన్లు
- ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నందున పనులు పూర్తిచేయించి సీఎం రేవంత్‌రెడ్డితో ప్రారంభోత్సవం చేయిస్తానన్న జగ్గారెడ్డి
- గతంలోనూ సీఎంలు వైఎస్ఆర్, కిరణ్‌కుమార్‌రెడ్డిని సదాశివపేటకు తీసుకొచ్చానని గుర్తుచేసుకున్న జగ్గారెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న నిర్మల, జగ్గారెడ్డి, పాల్గొన్న అధికారులు, స్థానిక నేతలు

సదాశివపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రంలో రూ.20 కోట్ల నిధులతో తాను మంజూరు చేయించిన సదాశివపేట పట్టణంలోని కందకం రోడ్డు పనులను గత 11ఏళ్లలో పూర్తి చేయకపోవడంపై జగ్గారెడ్డి మండిపడ్డారు. 2014లో తెచ్చిన నిధులతో పనులను ఎందుకు పెండింగ్‌లో ఉంచాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ఈ రోడ్డు పూర్తయితే సదాశివపేట రూపురేఖలే మారుతాయని అన్నారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా 8 జంక్షన్లతోపాటు నిర్వాసితులకు ఒక్కొక్కరికి 150గజాల స్థలం, స్లాబు ఇల్లు ఉంటే రూ.15లక్షలు, రేకుల ఇంటికి రూ.10లక్షల చొప్పున పరిహారం ఇచ్చేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు నిర్మల, జగ్గారెడ్డి సూచించారు. నాలుగు నెలల్లో రోడ్డును పూర్తిచేస్తే సీఎం రేవంత్‌రెడ్డితో ప్రారంభోత్సవం చేయిస్తానన్నారు.





బండమైలారం చెరువులోని స్తంభంపై మరమ్మతు చేస్తున్న జూనియర్ లైన్‌మన్

ముంపులో ఉన్నా.. మరమ్మతు ఆపలేదు

● కరెంట్ కష్టాలు తీర్చడానికి లైన్‌మన్ సాహసం

ములుగు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామస్థులకు, రైతులకు విద్యుత్ సరఫరాకు ఆటంకం కలగకూడదన్న లక్ష్యంతో ఓ లైన్‌మన్ తన ప్రాణాలకు తెగించాడు. చెరువు నీళ్లలో పాక్షికంగా మునిగి ఉన్న కరెంట్ స్తంభాన్ని ఈత కొట్టుకుంటూ వెళ్లి ఎక్కి, విద్యుత్ మరమ్మతులు చేపట్టాడు.

శనివారం మండల పరిధిలోని బండమైలారం గ్రామంలో, 11 కేవీ కొత్తూరు ఏజీఎల్ ఫీడర్‌పై డిస్క్ ఇన్సులేటర్ ఫెయిల్ కావడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అయితే, ఆ పెయిలైన స్తంభం పూర్తిగా చెరువు నీటిలో మునిగి ఉండటంతో... జూనియర్ లైన్‌మన్ కరుణాకర్, తాను వెంట తెచ్చుకున్న తాడు సాయంతో ఈత కొట్టుకుంటూ స్తంభం వద్దకు చేరుకున్నాడు. ప్రాణాలకు ప్రమాదకరం అయినప్పటికీ, విద్యుత్‌ను పునరుద్ధరించేందుకు ఆ నీటి స్తంభంపైనే నిలబడి మరమ్మతులు పూర్తి చేశాడు. ఏడీఏ శ్రీనివాసులు, ఏఈ శ్రీనివాస్, లైనింగ్ ఇన్‌స్పెక్టర్ బాలయ్య, ఇతర సిబ్బంది ప్రభాకర్ సహాయమందించారు. సిబ్బంది సాహసానికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



మరమ్మతు చేపట్టిన సిబ్బంది

హస్తవాసి ఎవరికో?

జిల్లా అధ్యక్షుల ఎంపికపై కాంగ్రెస్ ఫోకస్

కాంగ్రెస్ పార్టీ జిల్లాల నూతన అధ్యక్షులను ఎంపిక చేయడానికి ముహూర్తం ఖరారైంది. నేటి నుంచే ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ మేరకు సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాలకు ఏఐసీసీ పరిశీలకులను పంపించింది. వీరు వారం రోజులపాటు ఇక్కడే ఉంటారు. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలు, నేతల అభిప్రాయాలను స్వీకరించి ఆయా జిల్లాలకు కొత్త అధ్యక్షులను ఎంపిక చేస్తారు.


- నేటి నుంచే దరఖాస్తుల స్వీకరణ
- సంగారెడ్డి అబ్జర్వర్‌గా సజరిట
- మెదక్, సిద్దిపేటలకు జ్యోతి రౌటేలా
- నియోజకవర్గాల వారీగా సమావేశాలకు సన్నద్ధం
- వారం పాటు పర్యవేక్షించనున్న పరిశీలకులు
- పదవుల కోసం పోటాపోటీగా ప్రయత్నాలు



సంగారెడ్డి జిల్లా పార్టీ అబ్జర్వర్ సజరిట లైట్‌ఫ్లాంగ్



సిద్దిపేట, మెదక్ జిల్లాల అబ్జర్వర్ జ్యోతి రౌటేలా



సిద్దిపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి మెదక్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం అధిష్ఠానం ప్రత్యేక దృష్టి సారించింది. ముందుగా సమర్థులైన వారికి ఆయా జిల్లాల పార్టీ పగ్గాలు అప్పగించడానికి చర్యలు చేపట్టింది. గతంలో వలే సీనియారిటీకి పట్టం కట్టకుండా అందరి అభిప్రాయాల ఆధారంగానే రథసారథులను ఎంపిక చేయాలని ప్రణాళిక సిద్ధం చేశారు.

రేసులో ఉన్నది వీరే..

సిద్దిపేట జిల్లాలో సిద్దిపేట నియోజకవర్గ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ, దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్, మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ గిరి కొండల్‌రెడ్డి, సీనియర్ నేతలు దరిపల్లి చంద్రం, గంప మహేందర్, ...సీ మెంబర్ సూర్యవర్మ, గజ్వేల్‌కు చెందిన బండారు ...కాంత్‌తోపాటు ప్రస్తుత అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సైతం జిల్లా అధ్యక్ష రేసులో ఉన్నారు. ఇక మెదక్ జిల్లాలో ప్రధానంగా ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి పదవిని ఆశిస్తున్నారు. అదేవిధంగా సంగారెడ్డి జిల్లాలో ప్రధానంగా జహీరాబాద్‌కు చెందిన ఉజ్వల్‌రెడ్డి పేరు వినిపిస్తోంది. మరికొందరు ఆశావహుల పేర్లు తెరమీదకు వచ్చే అవకాశం ఉంది.

మహిళా నేతలే అబ్జర్వర్లు

సంగారెడ్డి జిల్లాకు సజరిటా లైట్‌ఫ్లాంగ్, ...సీసీ జాతీయ సెక్రటరీని అబ్జర్వర్‌గా ...మించారు. మేఘాలయ

మిగతా 7వ పేజీలో

మూడు దశాబ్దాల అజ్ఞాతం వీడిన కంకటి

● మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడి లొంగుబాటు



డీజీపీతో మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడు కంకటి వెంకటయ్య

మద్దూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మూడు దశాబ్దాల సుదీర్ఘ అజ్ఞాత జీవితానికి ముగింపు పలుకుతూ మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడు కంకటి వెంకటయ్య అలియాస్ వికాస్ జనజీవన స్రవంతిలో కలిశారు. ఉడుకురక్తంతో పీపుల్స్‌వార్‌లో చేరిన నాటి నుంచి రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎదిగిన ఆయన, వయోభారం, అనారోగ్య కారణాల వల్ల ఇటీవల పోలీసుల ఎదుట లొంగిపోయారు.

ధూళ్మిట్ట మండలం కూటిగల్ గ్రామానికి చెందిన కంకటి లచ్చవ్వ ఓజయ్య దంపతుల చిన్న కుమారుడే వెంకటయ్య. ధూళ్మిట్ట ప్రభుత్వ హాస్టల్‌లో పదో తరగతి పూర్తి చేసిన ఆయన, ఇంటర్ చదువుతున్న సమయంలోనే విప్లవ భావాలకు ఆకర్షితులయ్యారు. 1990లో తన 19వ ఏట, అప్పటి పీపుల్స్‌వార్ చేర్యాల దళ కమాండర్ బాలన్న ప్రోత్సాహంతో దళంలో చేరారు. దళ సభ్యుడిగా ప్రస్థానం ప్రారంభించిన వెంకటయ్య, మహదేవ్‌పూర్‌లో జిల్లా కమిటీ సభ్యుడిగా పనిచేశారు. ఆ తర్వాత చత్తీస్‌గఢ్ ప్రాంతంలో మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడి స్థాయికి ఎదిగారు. దళంలోనే సహచర మావోయిస్టు మంజులను వివాహం చేసుకున్నారు. వెంకటయ్య అజ్ఞాతంలో ఉండటంతో, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు కళ్లు కాయలు కాచేలా కుమారుడి రాక కోసం ఎదురుచూశారు. ఆరేళ్ల క్రితం తండ్రి ఓజయ్య, ఆ తర్వాత ఏడాదిలోపే తల్లి లచ్చవ్వ మరణించారు. వెంకటయ్య భార్య మంజుల గతేడాది వరంగల్‌లో పోలీసుల ఎదుట లొంగిపోయారు. చివరికి, అనారోగ్యంతో పాటు ఇతర కారణాల వల్ల వెంకటయ్య రాష్ట్ర డీజీపీ సమక్షంలో లొంగిపోయారు. మూడు దశాబ్దాల అనంతరం స్వగ్రామం కూటిగల్‌కు విచ్చేయనున్న వెంకటయ్యకు ప్రస్తుతం గ్రామంలో పాడుబడిన ఇల్లు మాత్రమే మిగిలి ఉంది. ఆయన రాకకోసం స్థానికులు ఎదురుచూస్తున్నారు.

అరగంటకో రైలు.. హైవేపై స్పీడ్‌కు బ్రేక్!

తూప్రాన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ముంబై-విజయవాడ హైవే రోడ్లను అనుసంధానిస్తూ సంగారెడ్డి నుంచి నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్, భువనగిరి మీదుగా చౌటుప్పల్ వరకు ఉన్న 157 కిలోమీటర్ల పొడవైన హైవే 161(ఏఏ)పై జాతీయ రహదారిపై నిత్యం పెద్ద సంఖ్యలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ హైవేపై తూప్రాన్ పరిధిలోని బ్రాహ్మణపల్లి వద్ద సికింద్రాబాద్-మన్మాడ్ రైల్వేలైన్ అడ్డంగా వెళ్లడంతో రైల్వే లెవల్ క్రాసింగ్‌ను ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో నిత్యం 40కి పైగా ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు, 15 వరకు గూడ్స్‌రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. అంటే, దాదాపు అరగంటకోసారి రైలు వెళ్తుంటుంది. దీంతో ప్రతీసారి లెవల్ క్రాసింగ్ గేటు మూసేస్తుంటారు. గేటు పడిన ప్రతిసారీ ఇరువైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోతున్నాయి. ఒక్కోసారి 15 అరగంట వరకు గేటు వేసి ఉంచాల్సి వస్తోంది. ఈ హైవేపై ప్రయాణం చేసే వాహనదారులు, ప్రయాణికులు సరైన సమయానికి గమ్యస్థానం చేరుకోలేకపోతున్నారు.





ఏడు నెలలుగా ఎదురుచూపులు

- ప్రభుత్వ పాఠశాలల సహాయకులకు అందని వేతనాలు
- సకాలంలో నిధులు ఇవ్వాలని వేడుకోలు

చేర్యాల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత, పచ్చదనం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'అమ్మ ఆదర్శ పాఠశాల' కార్యక్రమం కింద పనిచేస్తున్న సహాయకులకు (స్కావెంజర్లు) వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపు ఏడు నెలలు కావస్తున్నా, జీతాలు మాత్రం చేతికి అందకపోవడంతో దసరా పండుగను కూడా పస్తులతోనే గడపాల్సి వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

పాఠశాలల నిర్వహణ బాధ్యతను పాఠశాల కమిటీలకు అప్పగించి, స్కూల్ ఫెసిలిటీ మెయింటెనెన్స్ గ్రాంట్ (ఎస్ఎఫ్ఎమ్‌జీ) కింద ప్రత్యేక నిధులు కేటాయించారు. ఈ నిధులతోనే సహాయకులను నియమించి, టాయిలెట్లు శుభ్రపరచడం, పరిసరాలు పచ్చదనంగా ఉంచడం, తరగతి గదులను శుభ్రం చేయడం వంటి పనులు చేయిస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో మొత్తం 951 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. విద్యార్థుల సంఖ్యను బట్టి పాఠశాలలకు నెలకు నిధులు కేటాయించారు. 1-30 మంది విద్యార్థులున్న పాఠశాలలకు రూ.3 వేలు, 31-100 మంది వరకు రూ.6 వేలు, 101-250 మంది వరకు రూ.8 వేలు, 251-500 మంది వరకు రూ.12 వేలు, 501-750 వరకు రూ.15 వేలు, 750పై ఉన్న పాఠశాలలకు రూ.20 వేలు చొప్పున ఇవ్వాలని నిర్ణయించారు. ఈ చాలీచాలనీ వేతనాలు కూడా సకాలంలో అందకపోవడంతో సహాయకులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. నిర్ణీత సమయంలో వేతనాలు చెల్లిస్తారని ఆశించినప్పటికీ, నిధుల విడుదలలో జాప్యం జరుగుతుండటంతో ఆర్థికంగా చితికిపోతున్నామని వాపోతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం

గతంలోనూ బకాయిల కోసం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేసినా అధికారుల్లో చలనం రాలేదని సహాయకులు మనోవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి, వెంటనే బకాయి వేతనాలను అందించాలని, అదేవిధంగా విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా స్థిర వేతనం అందించేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

వెలుగు దివ్వెలు





వెలుగుల పండుగ దీపావళికి మరికొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో, సిద్దిపేటలోని భోగట్టా ప్రాంతపు కుమ్మరులు దీపాలు, ఇతర మట్టి వస్తువుల తయారీలో పూర్తిగా నిమగ్నమయ్యారు. గత సంవత్సరం దీపాలు ఆశించిన స్థాయిలో అమ్ముడుపోక భారీగా నష్టపోయిన నేపథ్యంలో, ఈసారి ఎలాగైనా మంచి లాభాలు పొందాలనే సంకల్పంతో కొత్త ఆశలతో ముందుకెళుతున్నారు. విభిన్నమైన, వినూత్న డిజైన్లలో దీపాలు తయారు చేస్తున్నారు. ఆరుబయట ఆరబెట్టడం, కొలిమిలో కాల్చడం వంటి పనులలో కుటుంబసభ్యులంతా పాల్గొంటూ, ఈ దీపావళికైనా తమ కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కాలని వారు ఆకాంక్షిస్తున్నారు.

\- స్టాఫ్ ఫొటోగ్రాఫర్ (ఆంధ్రజ్యోతి)





టాస్క్‌ఫోర్స్ సిబ్బందిపై తండావాసుల దాడి

● గంజాయి మొక్కలు తొలగిస్తున్నందుకు..

● 64 గంజాయి మొక్కలు, ఎండు గంజాయి స్వాధీనం


ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులతో వాగ్వాదానికి దిగిన తండా వాసులు

నారాయణఖేడ్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పత్తిలో అంతర పంటగా గంజాయి మొక్కలు సాగు చేస్తున్నట్లు నమ్మదగిన సమాచారం అందడంతో పట్టుకోవడానికి వెళ్లిన జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులపై తండా వాసులు వాగ్వాదానికి దిగి దాడి చేసి, వారి నుంచి సెల్‌ఫోన్లు లాక్కున్నారు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం చల్లగిద్ద తండాలో శనివారం చోటు చేసుకుంది. జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ సీఐ శంకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చల్లగిద్ద తండాకు చెందిన జానకీరాం తన పంట పొలంలో పత్తిలో అంతర్‌పంటగా గంజాయిని సాగు చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐలు అరుణజ్యోతి, హన్మంతు, సిబ్బంది అంజిరెడ్డి, ప్రభాకర్‌లతో కలిసి తండాకు వెళ్లామన్నారు. జానకీరాం పొలంలో 64 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశామన్నారు. అనంతరం జానకీరాంతో పాటు అదే తండాకు చెందిన వడితే మోహన్ ఇంట్లో ఎండు గంజాయి ఉన్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బంది వారి గృహాలను తనిఖీ చేయడానికి వెళ్లగా, వారు తాళాలు వేసుకొని పారిపోయారన్నారు. ఇంట్లో తనిఖీలు చేసేందుకు ప్రయత్నించడంతో తండా వాసులు వాగ్వివాదానికి దిగి తమపై దాడి చేయడమే కాకుండా తమ నుంచి సెల్‌ఫోన్లు లాక్కున్నారన్నారు. వడితే మోహన్ ఇంట్లో నాలుగు ఎండు గంజాయి, గంజాయి విత్తనాల సంచులు ఉండగా, తాము వాటిని స్వాధీనం చేసుకోగా, రెండు సంచులను లాక్కుపోయారన్నారు. ఒక సంచిలో నాలుగు కిలోల ఎండు గంజాయి, కిలోన్నర గంజాయి విత్తనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. గిరిజనులు దాడి చేసిన విషయాన్ని నారాయణఖేడ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో డీఎస్పీ వెంకట్‌రెడ్డి, కంగ్టి సీఐ వెంకట్‌రెడ్డి, ఎస్ఐలు శ్రీశైలం, మొగులయ్యలు తండాను సందర్శించారన్నారు. తండాలో పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేశారు. దీంతో జానకీరాం, వడితే మోహన్‌లపై కేసులు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ తెలిపారు.

డివైడర్ ఎక్కించి.. కారును ఢీ కొట్టి

● డ్రైవర్ నిద్రమత్తే కారణం ● ఏడుగురికి గాయాలు


ప్రమాదానికి గురైన కారు

పటాన్‌చెరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : నిద్రమత్తులో కంటైనర్ లారీ డ్రైవర్ అదుపు తప్పి డివైడర్ ను ఎక్కించి అవతలి వైపు ప్రయాణం చేస్తున్న ఓ కారును ఢీకొట్టారు. దీనిలో ప్రయాణం చేస్తున్న ఏడుగురు కుటుంబసభ్యులు గాయపడిన సంఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ విజయకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బెంగుళూరు నుంచి ప్రొక్లయినర్ లోడ్‌తో కంటైనర్ లారీ నేపాల్‌కు ప్రయాణం చేస్తున్నారు. రాజేంద్రనగర్ వద్ద అవుటర్‌పైకి ఎక్కారు. ముత్తంగి అవుటర్ ఎగ్జిట్‌కు సమీపంలో కర్దనూరు గ్రామం వద్దకు వచ్చే సమయానికి కంటైనర్ నడుపుతున్న డ్రైవర్ నిద్రలోకి వెళ్లారు. దీంతో లారీ ఒక్కసారిగా డివైడర్ ఎక్కి అవతలివైపు రోడ్డులో సగం వరకు వచ్చింది. అదేసమయంలో గుల్బర్గా నుంచి హైదరాబాద్ కు కుటుంబసభ్యులతో వెళుతున్న కారును ఢీకొట్టారు. దానిలో ఉన్న బషీర్, మోయిన్, మునీర్, జబీఉన్నీసా, షేక్‌ఆరిఫ్, కిబ్రాఉన్నీసా, రహమత్ ఉన్నీసా లు తీవ్రంగా గాయపడ్డారు. లారీకి చెందిన డీజిల్ ట్యాంకు పగిలిపోయింది. డీజిల్ అవుటర్‌పై పారి ప్రమాదకరంగా మారింది. విషయం తెలుసుకున్న అవుటర్ సిబ్బంది ప్రమాదహెచ్చరికలు పెట్టారు. సమాచారం అందుకున్న అవుటర్ రోడ్డు నిర్వహణ సిబ్బంది గాయపడిన ఏడుగురిని హైటెక్ సిటీ యశోదా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టిన కారు

● ముగ్గురికి గాయాలు


ధ్వంసమైన కారు


గాయపడిన మహిళ

కొండపాక, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలైన సంఘటన కొండపాక స్టేజి వద్ద శనివారం చోటు చేసుకుంది. హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తున్న కారు కొండపాక స్టేజి వద్దకు రాగానే బర్రెను తప్పించబోయి రోడ్డు కిందకు దిగిపోయి చెట్టును బలంగా ఢీకొట్టింది. దాంతో కారులో ప్రయాణం చేస్తున్న దంపతులు మల్లారెడ్డి, రాజహంసతో పాటు మరో వ్యక్తి ప్రతాప్ రెడ్డిలకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న కొండపాక 108 సిబ్బంది మెడికల్ టెక్నీషియన్ మహేందర్, పైలట్ రమేష్ హుటాహుటిన ఘటన ప్రాంతానికి చేరుకున్నారు. గాయపడిన వారిని అంబులెన్సులోకి తరలించి వారికి అవసరమైన ప్రాథమిక చికిత్స అందిస్తూ సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యం


యువకుడి మృతదేహం

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణ శివారులోని మహబూబ్‌సాగర్ చెరువులో అనుమానాస్పదంగా ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. సంగారెడ్డి పట్టణ సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి పట్టణ శివారులోని మహబూబ్‌సాగర్ చెరువులో 25-30 సంవత్సరాల మధ్య వయస్సున్న యువకుడి మృతదేహం లభ్యమైంది. చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి మృతి చెందాడా? లేక కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెంది ఉంటాడా? లేక ఏ ఇతర కారణాల చేత అయినా మృతి చెందాడా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని సీఐ రమేష్ తెలిపారు. మృతున్ని ఎవరైనా గుర్తిస్తే 08455 276333 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


అక్షయ్ కుమార్ (ఫైల్)

కొండపాక, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి 18 నెలలుగా చికిత్స పొందుతూ శనివారం ఓ యువకుడు మృతి చెందిన ఘటన కొండపాక మండలం అంకిరెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కోడిపల్లి అక్షయ్‌కుమార్(20) హైదరాబాద్‌లో పాలిటెక్నిక్‌లో రెండవ సంవత్సరం చదువుతున్నాడు. 18 నెలల క్రితం కళాశాలకు వెళ్తూ రోడ్డు దాటుతుండగా ఓ కారు అక్షయ్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతని వెన్నుపూస భాగం దెబ్బతింది. అప్పటి నుంచి హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స అందించినప్పటికీ నయం కాక మృతి చెందాడు. దాదాపు రూ.30 లక్షలు ఖర్చు చేసినా కన్న కొడుకు బతకకపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య


బాల్‌రాజ్ (ఫైల్)

మునిపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మేళాసంఘం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. మునిపల్లి ఎస్ఐ రాజేష్ నాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మేళాసంఘం గ్రామానికి చెందిన బేగరి బాల్‌రాజ్ (49)కు ఝరాసంగం మండలం చిలుకపల్లి గ్రామానికి చెందిన భారతమ్మతో గత 24 ఏళ్ల క్రితం వివాహం అయింది. వారిద్దరూ కంకోల్ గ్రామ శివారులో గల ఓక్సెన్ యూనివర్సిటీలో వర్కర్‌గా పని చేస్తున్నారు. ఏడాది నుంచి మద్యానికి బానిసైన బాల్‌రాజ్ రోజూ తాగి వచ్చి డబ్బులు కావాలని భార్య భారతమ్మతో గొడవ పడేవాడు. ఈ నెల 1వ తేదీన రాత్రి కూడా తాగి వచ్చి డబ్బులు కావాలంటూ వేధించడంతో భారతమ్మ తన తల్లిగారి ఊరైన చిలుకపల్లికి వెళ్లింది. అక్కడ నుంచి ఓక్సెన్ యూనివర్సిటీకి ఈ నెల 7న వస్తే, అక్కడ కూడా గొడవ చేశాడు. దీంతో చేసేదేమీ లేక తల్లిగారింటికి వెళ్లిపోయింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన బాల్‌రాజ్ మేళాసంఘం గ్రామంలోని తన ఇంట్లోని బాత్రూమ్‌లో శుక్రవారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఆరుగురు దొంగల అరెస్టు

● జల్సాలకు అలవాటుపడి నేరస్థుడిగా మారి...

● వృద్ధురాలి నగలు దొంగిలించిన నిందితుడి అరెస్టు

● బంగారు, వెండి నగలు, బైక్ స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

పుల్‌కల్/జోగిపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి):ఉమ్మడి జిల్లాలో శనివారం వేర్వేరు ఓట్ల చోరీ కేసుల్లో పోలీసులు ఆరుగురు నిందితులను పట్టుకున్నారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. సులువుగా డబ్బు సంపాదించాలన్న దురాశ, జల్సాలకు అలవాటు పడిన ఓ వ్యక్తి నేరస్థుడుగా మారాడు. వృద్ధురాలి ఒంటిపై ఉన్న నగలను అపహరించి పట్టుబడిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను జోగిపేట సీఐ అనిల్‌కుమార్, పుల్కల్ ఎస్ఐ విశ్వజన్‌తో కలిసి శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని భగత్‌సింగ్ నగర్‌కు చెందిన మంగలి సత్తమ్మ శుక్రవారం సదాశివపేటలో ఉండే తన చెల్లెలు వద్దకు వెళ్లేందుకు సంగారెడ్డి పాత బస్టాండ్ వద్ద నిలబడి ఉన్నారు. ఈ క్రమంలో మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలం బంజారా నగర్ గిరిజన తండాకు చెందిన రమావత్ బస్సీలాల్ (36) మోటారు బైక్‌పై వెళ్తూ వృద్ధురాలిని గమనించాడు. వృద్ధురాలు ఒంటిపై ఉన్న నగలను దొంగిలించాలన్న ఉద్దేశంతో, తాను సదాశివపేటకు వెళ్తున్నానని, మీ చెల్లి ఇంటి వద్దనే దింపుతానని నమ్మించాడు. అయితే, సింగూరు మీదుగా వెళ్తానని చెప్పడంతో వృద్ధురాలు సత్తమ్మ నిందితుడి బైక్‌పై ఎక్కారు. శివంపేట మీదుగా తాడ్దానిపల్లి టోల్‌ప్లాజా దాటగానే సింగూరు వైపునకు వెళ్తూ, గొంగ్లూరు గ్రామ శివారులో గల మైసమ్మ ఆలయం వద్ద మధ్యాహ్నం సమయంలో చుట్టు పక్కల ఎవరు జన సమూహం కనిపించకపోవడంతో బస్సీలాల్ మోటారు బైక్‌ను ఆపాడు. వృద్ధురాలిని కిందకు దించి చంపేస్తానంటూ బెదిరించాడు. వెండి కడియాలు, చెవులకు ఉన్న బంగారు మ్యాట్నీలను బలవంతంగా లాక్కున్నాడు. వృద్ధురాలు పెనుగులాడటంతో చెవులు తెగిపోయి తీవ్ర రక్తస్రావం అయింది. బలవంతంగా నగలు, కడియాలు తీసుకుంటుండగా, అరుపులు, కేకలు వేయడంతో రోడ్డుపై వెళ్తున్న ప్రయాణీకులు వచ్చి బస్సీలాల్‌ను పట్టుకున్నారు. సంఘటన విషయమై బాధితురాలు మంగలి సత్తమ్మ పుల్కల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా, చేసిన నేరాన్ని అంగీకరించాడు. జల్సాలకు అలవాటు పడి తరచుగా దొంగతనాలకు పాల్పడుతున్నాడని సీఐ అనిల్‌కుమార్ వివరించారు. నిందితుడి నుండి బంగారు, వెండి నగలు, మోటారు బైక్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ దొంగిలించిన సంఘటన, నర్సాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన అత్యాచార ఘటన, దొంగతనం, పాపన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఓ హత్య, దోపిడి సంఘటనల్లో బస్సీలాల్ నిందితుడిగా ఉన్నాడని తెలిపారు. ఈ మేరకు నిందితుడు బస్సీలాల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

సిగరెట్ల చోరీ కేసులో ఇద్దరు...

మెదక్ అర్బన్/మనోహరాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండలంలోని ఐటీసీ పరిశ్రమలో జరిగిన సిగరెట్ చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ మహేందర్ తెలిపారు. శనివారం మెదక్ ఎస్పీ కార్యాలయంలో వారు విలేకరులకు వివరాలు వెల్లడించారు. మనోహరాబాద్ మండల పరిధిలోని ఐటీసీ పరిశ్రమలో గత సంవత్సరం నుంచి ఇద్దరు వ్యక్తులు సుమారు రూ.33 లక్షల విలువైన సిగరెట్లను దొంగతనం చేశారు. నిందితులు మనోహరాబాద్ మండలం జీడిపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ మైదరబోయిన శ్రీకాంత్ (31), కోనాయపల్లి పీటీ గ్రామానికి చెందిన డ్రైవర్ చెట్టి మహేష్ (30) జీడిపల్లి ఐటీసీ గోదాంలో డ్రైవర్లుగా పని చేస్తూ పరిచయమయ్యారు. తరువాత దుర్వ్యసనాలకు అలవాటు పడి, అప్పులు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఐటీసీ గోదాంలో లోడవుతున్న సిగరెట్ బాక్సులను దొంగతనం చేసి డబ్బు సంపాదించాలని పథకం పన్నారు. మొదటిసారిగా పరిశ్రమలోకి దూరి 08-12-2024న రూ.8.30 లక్షలు, 18-05-2025న రూ. 15 లక్షల విలువైన సిగరెట్ ప్యాకెట్లను దొంగతనం చేసి బయట మార్కెట్‌లో అమ్ముకున్నారు. అదే తరహాలో 21-09-2025న చివరిసారిగా రూ.10 లక్షల విలువైన సిగరెట్ ప్యాకెట్లను దొంగతనం చేశారు. ఈ మూడు దొంగతనాలు కలిపి సుమారు రూ.33 లక్షల విలువైన సిగరెట్ బాక్సులను దొంగిలించి, చెట్టి మహేష్ పొలంలో దాచి బయటి వ్యాపారులకు అమ్మివేశారు. రెండుసార్లు అమ్ముకున్న సొమ్ము రూ.18.64 లక్షలను సమానంగా పంచుకున్నారు. మూడవసారి మార్కెట్లో అమ్మడానికి వేరే వ్యక్తి కోసం చూస్తుండగా, మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్‌గౌడ్ జీడిపల్లి వద్ద తనిఖీల్లో భాగంగా అనుమానంతో వాహనాన్ని పట్టుకుని అదుపులోకి తీసుకుని విచారించగా, నిందితులు నేరాలకు ఒప్పుకున్నారు. నిందితులపై గతంలో చైతన్యపురి, మనోహరాబాద్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నాయని తెలిపారు. పోలీసులు రూ.10 లక్షల విలువైన సిగరెట్ ప్యాకెట్లు, పూర్వపు దొంగతనాలకు సంబంధించిన రూ.8 లక్షల నగదును రికవరీ చేశారు. ఈ కేసును ఛేదించిన తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్, తూప్రాన్ సీఐ రంగాకృష్ణ, మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్‌గౌడ్, సిబ్బంది రాధాకృష్ణ, బిక్షపతి, నరేందర్‌గౌడ్, సురేష్‌లను జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు

కారులో లిఫ్ట్ ఇచ్చి.. దోపిడీకి పాల్పడి..

నర్సాపూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్‌లో రోడ్డుపై నిలుచున్న వారికి లిఫ్ట్ ఇస్తామని చెప్పి కారులో ఎక్కించుకుని బెదిరించి డబ్బులు తీసుకుని మధ్యలోనే వదిలేసి వెళ్లిన ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేసినట్లు మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు తెలిపారు. శనివారం మెదక్‌లోని ఎస్పీ కార్యాలయంలో అదనపు ఎస్పీ రమేష్, డీఎస్పీ నరేందర్‌గౌడ్‌తో కలిసి విలేకరులకు వివరాలు వెల్లడించారు. పాపన్నపేట మండలం నార్సింగి గ్రామానికి చెందిన నీలగిరి దశరథ్, రేగోడ్ మండలం లింగంపల్లికి చెందిన ఆగమయ్య, టేక్మాల్ మండలం కోరంపల్లికి చెందిన దన్నారం కృష్ణ ఈ నెల 7వ తేదీన కారు అద్దెకు తీసుకుని సంగారెడ్డి వైపు నుంచి వస్తున్నారు. మధ్యలో నర్సాపూర్ సమీపంలోని క్లాసిక్ గార్డెన్ వద్ద ఓ స్కూటీపై వెళ్తున్న వ్యక్తిని అటకాయించి బెదిరించి అతని వద్ద ఉన్న రూ.350 తీసుకున్నారు. అనంతరం నర్సాపూర్ చౌరస్తాకు వచ్చారు. అక్కడ ఇద్దరు మెదక్ వెళ్లడానికి వాహనం కోసం ఎదురుచూస్తున్న వారిని తాము కూడా మెదక్ వెళ్తున్నామని చెప్పి ఎక్కించుకున్నారు. కౌడిపల్లి మండలం వెంకట్రావుపేట వద్దకు వచ్చాక చంపుతామని బెదిరించి వారి వద్ద ఉన్న రూ.2,500లతో ఫోన్‌పే ద్వారా రూ.5,500 వేయించుకుని వారిని మధ్యలోనే వదిలేసి వెళ్లారు. బాధితులు వెంటనే నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో డీఎస్పీ నరేందర్‌గౌడ్ పర్యవేక్షణలో సీఐ జానరెడ్డి, ఎస్ఐ రంజితకుమార్‌రెడ్డిల నేతృత్వంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలతో జగద్గిర్‌గుట్ట ఆల్విన్‌కాలనీలో నిందితులు ఉన్నట్టు గుర్తించారు. శనివారం వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, నేరానికి ఒప్పుకున్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి కారుతో పాటు మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా కేసును ఛేదించిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

హిందీ పండిట్ల అడ్డా అబ్బెంద

ఒకే గ్రామంలో 50 మందికి పైగా..

ఒకరా.. ఇద్దరా ఏకంగా ఆ గ్రామంలో 50 మందికి పైగా హిందీ పండిట్లున్నారు. ఇక ఆ గ్రామ చుట్టుపక్కల గ్రామాలను లెక్కలోకి తీసుకుంటే వందకు పైమాటే. ఆ గ్రామ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేసిన కె. రాంచందర్ ప్రత్యేక కృషితో అనేక మంది విద్యార్థులు హిందీ పండిట్లుగా నియమితులై గ్రామానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చారు. వందల మంది హిందీ పండిట్లతో హిందీ భాషా స్ఫూర్తి కేంద్రంగా వెలుగొందుతున్న ఆ గ్రామం సంగారెడ్డి జిల్లా, నారాయణఖేడ్ మండలంలోని అబ్బెంద. హిందీ పండిట్లుగా ఎదిగిన వారి అనుభవాలు, హిందీ బాషాభివృద్ధికి రాంచందర్ చేసిన కృషిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం

- పరిసర గ్రామాలతో కలిపి వందమంది వరకు..
- ఉపాధ్యాయుడు రాంచందర్ కృషితో..

నారాయణఖేడ్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ప్రతి గ్రామంలో అనేక వృత్తుల వారు, సామాజిక వర్గాల వారు కలిసిమెలిసి జీవిస్తుంటారు. కానీ, సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం అబ్బెంద గ్రామం మాత్రం ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ గ్రామం హిందీ పండిట్ల అడ్డాగా ప్రసిద్ధి చెందింది. ఈ చిన్న గ్రామం నుంచే 50 మందికి పైగా వ్యక్తులు హిందీ పండిట్లుగా ఎదిగి, వారిలో సుమారు 40 మంది వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తుండటం విశేషం. మూడు వేల జనాభా కలిగిన ఈ గ్రామంలో, కేవలం ఈ ఒక్క వృత్తిలో ఇంతమంది స్థిరపడటం వెనుక ఒక మాస్టారు నిస్వార్థ కృషి దాగి ఉంది. ఆయనే మాజీ హిందీ ఉపాధ్యాయుడు కె. రాంచందర్. అబ్బెంద గ్రామానికి, హిందీ భాషకు ఆయన అందించిన స్ఫూర్తి తరతరాలు గుర్తుంచుకునే విధంగా ఉంది.

హిందీ ఉపాధ్యాయుడి చొరవతో...

ఈ గ్రామం హిందీ పండిట్ల కేంద్రంగా మారడానికి ప్రధాన కారణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేసిన కె. రాంచందర్. మనూరు మండలం తోర్నాల్‌లో జన్మించిన రాంచందర్... ప్రాథమిక విద్యను స్వగ్రామంలో పూర్తి చేసి, అనంతరం మనూరు, మెదక్, హైదరాబాద్‌లలో ఉన్నత విద్యను అభ్యసించారు. 1979లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా నియామకమై, గజ్వేల్ సమీపంలోని గొల్లపల్లి పాఠశాలలో మొదట పనిచేశారు. ఆ తర్వాత, 1981లో నారాయణఖేడ్ మండలం అబ్బెంద ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చి, అక్కడ సుదీర్ఘంగా 13 సంవత్సరాలు హిందీ ఉపాధ్యాయుడిగా సేవలందించారు.



రాంచందర్‌ను హిందీ పండిత్‌లు

హిందీ ప్రచార్ సభ కృషి ఫలితం

ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే, రాంచందర్ 'హిందీ ప్రచార సభ'లో బాధ్యత చేపట్టి, నారాయణఖేడ్ ప్రాంత విద్యార్థులు హిందీలో రాణించేందుకు విశేషంగా కృషి చేశారు. ఆయన చొరవతో ఈ ప్రాంత విద్యార్థులకు 'హిందీ ప్రచార సభ' ద్వారా నిర్వహించే నగరిబోర్డ్, ప్రథమ ప్రవేశ, మధ్యమ, ఉత్తమ, విశారద, భూషణ్, విద్వాన్ వంటి ఉన్నత స్థాయి పరీక్షలు పరిచయమయ్యాయి. అబ్బెంద పాఠశాలలో చదివిన విద్యార్థులు ఈ అవకాశాలను చక్కగా వినియోగించుకుని, ప్రతి డీఎస్సీలో హిందీ పండిట్లుగా నియామకమయ్యారు. ఫలితంగా, అబ్బెంద గ్రామం నుంచే 50 మంది వరకు హిందీ పండిట్లుగా కొనసాగుతున్నారు. అబ్బెందతో పాటు పరిసర గ్రామాలకు చెందిన వారితో కలిపి మొత్తం వంద మందికి పైగా హిందీ ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వీరిలో 40 మంది ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. హిందీలోనే కాకుండా, అనేక మంది విద్యార్థులు ఇతర ఉద్యోగాలలోనూ ఉన్నత స్థాయికి చేరుకున్నారు.

హిందీ ప్రచారానికి అంకితమై..

రాంచందర్ హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే హిందీ భాషాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం, తెలంగాణ రాష్ట్ర హిందీ ప్రచార సభ రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా ఆయన బాధ్యతలు నిర్వహించారు. 2012 లో పదవీ విరమణ చేసినప్పటికీ, నేటికీ హిందీ భాషాభివృద్ధి కోసం శ్రమిస్తూనే ఉన్నారు. హిందీపై తనకున్న మక్కువను చాటుతూ, నారాయణఖేడ్‌లోని తన ఇంటికి 'హిందీ భవన్' అని రాయించుకున్నారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా కూడా ఆయన అవార్డు అందుకున్నారు. ఒక వ్యక్తి స్ఫూర్తితోనే అబ్బెంద గ్రామం హిందీ పండిట్ల అడ్డాగా మారింది. కాగా, రాంచందర్ కుమారుడు ధీరజ్ కూడా ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు.

ఆనందంగా ఉంది



తాను పనిచేసిన గ్రామంలో అనేక మంది హిందీ పండిట్లుగా, ఇతర ఉద్యోగాలలో ఉన్నతులుగా ఎదగడం ఆనందంగా ఉంది. మారుమూల గ్రామమైన తోర్నాల్‌లో జన్మించి, హిందీ పండిట్‌గా నియామకమై, హిందీ ప్రచార సభ రాష్ట్ర అధ్యక్షులుగా పని చేసే అవకాశం కలగడం ఆనందంగా ఉంది.

- రాంచందర్

అబ్బెందలో పనిచేయడం అదృష్టం



హిందీ పండితుల అడ్డాగా పేరొందిన అబ్బెంద ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పని చేసే అవకాశం రావడం ఆనందంగా ఉంది. నేను కూడా రాంచందర్ సార్ స్ఫూర్తితోనే హిందీ పరీక్షలు రాసి ఉద్యోగం సంపాదించాను.

- రమేష్‌రెడ్డి,
అబ్బెంద గ్రామ పాఠశాల హిందీ పండిత్



శివంపేట మంజీర నది వంతెన వద్ద కాపలాగా ఉన్న పోలీసులు

మంజీర నది వంతెన వద్ద పోలీసుల కాపలా

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన ఎస్పీ పరితోష్ పంకజ్

పుల్‌కల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం శివంపేట సమీపంలోని మంజీర నది వంతెన వద్ద పోలీసులు కాపలాగా ఉన్నారు. ఇటీవల వరుసగా ముగ్గురు వ్యక్తులు వంతెనపై నుంచి దూకి గల్లంతైన విషయం తెలిసిందే. వారిలో ఒకరి మృతదేహం లభించగా, మరో ఇద్దరి ఆచూకీ లభ్యం కాలేదు. ఈ విషయమై 'సూసైడ్ స్పాట్‌గా మంజీర' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో శనివారం ప్రచురించిన కథనానికి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ స్పందించారు. ఇందులో భాగంగానే, పుల్కల్, సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్లకు చెందిన ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లతో పాటు మరో ఇద్దరు కానిస్టేబుళ్లను కాపలాగా ఉంచారు. సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారికి అనుసంధానంగా నిర్మించిన ఆరు వరుసల వంతెనలపై పోలీసులు గస్తీ తిరుగుతున్నారు. దీనిపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వంతెనలపై శాశ్వతంగా ఎత్తైన ముళ్ల ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పట్టుదలతో చదివి.. గ్రూప్-1 సాధించి..

- పేదింట్లో మెరిసిన లావణ్య
- జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిగా బాధ్యతలు

మార్కుక్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పేద కుటుంబం.. ప్రభుత్వ పాఠశాలలో చదువు.. తెలుగుమీడియం నుంచి ఒక్కసారిగా ఇంగ్లిష్ మీడియం.. అయినా ఆమె ఎక్కడా వెనక్కి తగ్గలేదు. గ్రూప్-వన్ ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో చదవి మధ్యలో వచ్చిన రెండు ప్రభుత్వ ఉద్యోగాలను ఇందుకు సాధనంగా మార్చుకుని అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నారు మండల పరిధి చేబర్తికి చెందిన ర్యాకం లావణ్య. ఇటీవల విడుదలైన గ్రూప్ వన్ ఫలితాల్లో విజయం సాధించి శనివారం కరీంనగర్ జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. చేబర్తికి చెందిన ర్యాకం భూదమ్మ-బాలరాజులు కూలి పనులు చేస్తూ తమ ఐదుగురు సంతానాన్ని పాఠశాలలకు పంపించారు. వారి మూడో సంతానం అయిన లావణ్య పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివారు. పదో తరగతి పరీక్షల్లో ఉమ్మడి జగదేవ్‌పూర్ మండల టాపర్‌గా నిలిచారు. పాఠశాల ప్రాధానోపాధ్యాయుడు వెంకటేశం సహకారంతో బాసర ట్రిబుల్ ఐటీలో ఐదేళ్ల ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేశారు. హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకుని ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా మొదటి ఉద్యోగం సాధించారు. సంగారెడ్డి జిల్లాలో విధుల్లో చేరి.. మళ్లీ చదువు కొనసాగిస్తూ 2021లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం సంపాదించారు. సిద్దిపేట త్రీ టౌన్, కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్, కామారెడ్డి జిల్లా రామారెడ్డిలో ఎస్సైగా పని చేశారు. తాజాగా విడుదలైన గ్రూప్-1లో ఉత్తీర్ణత సాధించి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగాన్ని సంపాదించారు. పేద కుటుంబంలో పుట్టి జిల్లా అధికారిగా బాధ్యతలు చేపట్టిన లావణ్యను పలువురు అభినందిస్తున్నారు. అయితే, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే తాను ఈ స్థాయికి వచ్చినట్లు లావణ్య తెలిపారు.


కరీంనగర్ కలెక్టర్ ప్రమీల సత్పతి చేతుల మీదుగా బాధ్యతలు స్వీకరిస్తున్న లావణ్య

కారు, బైక్ ఢీకొని వ్యక్తి మృతి

హవేళిఘణపూర్, అక్టోబరు 11: కారు, బైక్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని శమ్నాపూర్ గేటు వద్ద శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని చిన్నశంకరంపేట మండలం ఎస్. కొండాపూర్ గ్రామానికి చెందిన మత్తడి నర్సింహులు(44) ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవిస్తున్నాడు. శుక్రవారం నర్సింహులు రామాయంపేట వైపు నుంచి మెదక్ వైపు వస్తుండగా, శమ్నాపూర్ గేటు మలుపు వద్ద కారు నర్సింలు బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అంబులెన్సులో మెదక్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని మరో ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుని భార్య చంద్రకళ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

ఫోన్ మాట్లాడవద్దన్నందుకు యువతి అదృశ్యం

పటాన్‌చెరు అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌లో మాట్లాడవద్దంటూ తల్లి మందలించినందుకు ఓ యువతి అదృశ్యం అయిన సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటరెడ్డి కథనం ప్రకారం.. ఇస్నాపూర్ కరెంటు ఆఫీస్ వద్ద నివాసం ఉంటున్న ప్రియ అనే యువతి వస్త్ర దుకాణంలో పని చేస్తున్నారు. ఈ నెల 8న ఉదయం సమయంలో ఫోన్‌లో మాట్లాడుతుండగా తెలియని వ్యక్తులతో ఫోన్‌లో మాట్లాడవద్దంటూ తల్లి లక్ష్మి మందలించారు. ఆ తర్వాత ఇంటి నుంచి వెళ్లిన ప్రియ తిరిగి రాలేదు. పరిసరాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ప్రియ(ఫైల్)

టెట్‌పై రివ్యూ పిటిషన్ వేయాలి

- టీపీటీఎఫ్ డిమాండ్

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయిపై దాడి చేసిన న్యాయవాది రాకేష్ కిషోర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి డిమాండ్ చేశారు. సిద్దిపేట అర్బన్ మండల శాఖ సర్వసభ్య సమావేశం శనివారం ఇందిరానగర్ ఉన్నత పాఠశాలలో అర్బన్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శిగా సి. అనిల్ కుమార్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)పై రివ్యూ పిటిషన్ వేయాలని, 2010 కంటే ముందు నియామకమైన టీచర్లకు మినహాయింపు ఇవ్వాలన్నారు. అర్బన్ మండలంలోని ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని, కేసీఆర్ నగర్ ఉన్నత, ప్రాథమిక, ఉర్దూ మీడియం పాఠశాలల్లో వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ కె.తిరుపతి, జిల్లా కౌన్సిలర్ జె. విష్ణువర్ధన్, బి.మల్లేశం, టి. శ్రీనివాస్, రాజు, సుధాకర్ రావు, ఎల్లయ్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి

సింగీతం నరసింహా రావు 'నరసింహ శతకం' ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దత్తాత్రేయ శర్మ తదితరులు

కొండపాక, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలుగులో శతక సాహిత్యం సమాజ నిర్మాణానికి చేసిన మేలు అజరామరమని అవధాన విద్యా వికాస పరిషత్ అధ్యక్షులు మరుమాముల దత్తాత్రేయ శర్మ అభిప్రాయపడ్డారు. కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని శ్రీ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో విజయదుర్గా మాత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన సింగీతం నరసింహా రావు రచించిన 'నరసింహ శతకం' ఆవిష్కరణ మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలుగునాట ఈనాటికీ విరివిగా శతకరచన కొనసాగుతుండడం ఆ ప్రక్రియకు ఉన్న ప్రాధాన్యతకు నిదర్శనమన్నారు. సింగీతం నరసింహా రావు రచించిన శతకం నీతిశతకాలలో విలక్షణంగా నిలుస్తుందని తెలిపారు. సమావేశానికి అధ్యక్షత వహించిన డాక్టర్ చెప్పెల హరినాథ శర్మ మాట్లాడుతూ పద్యవిద్యా వికాసానికి కృషి చేస్తున్న నరసింహా రావు తొలి శతకం వెలువరించడం శుభ పరిణామమన్నారు. కేసీఆర్ విద్యా గురువు వేలేటి మృత్యుంజయ శర్మ మాట్లాడుతూ ఆంగ్ల ఉపాధ్యాయులు అయినప్పటికీ సింగీతం తెలుగులో శతకాన్ని వెలువరించడం అభినందనీయమన్నారు. శతకకర్త సింగీతం నరసింహా రావు మాట్లాడుతూ పద్య విద్యను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో 'రామంభజే శ్యామలం', 'కృష్ణం వందే జగద్గురుం' సంస్థలు పని చేస్తున్నాయన్నారు. కవి వర్కోలు లక్ష్మయ్య కావ్య పరిచయం చేయగా, అష్టావధాని సరస్వతీ రామ శర్మ, ముత్యంపేట గౌరీశంకర శర్మ, కెవిఎన్ ఆచార్య, పండరి రాధాకృష్ణ, అయితా బాలరాజేశం తదితరులు ప్రసంగించారు.

ఖాజాపూర్‌లో హత్య కేసు నిందితుల హల్‌చల్

- బాధితుని కుటుంబ సభ్యులతో ఘర్షణ, పోలీసులకు ఫిర్యాదు

కల్హేర్/సిర్గాపూర్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి) : ఒక హత్య కేసుతో సంబంధం ఉన్న నిందితులు బాధితుల ఇంటికి వెళ్లి బెదిరింపులకు పాల్పడుతూ హల్‌చల్ చేశారు. వివారాల్లోకి వెళితే సిర్గాపూర్ మండలం ఖాజాపూర్ గ్రామానికి చెందిన కుర్మ రమేష్ కుటుంబంతో అదే గ్రామానికి చెందిన కుర్మ హన్మంతు కుటంబానికి భూమికి వెళ్లే రహదారి విషయంలో గొడవలు ఉన్నాయి. ఈ సంవత్సరం జూన్ 29న తన మిత్రుడు కార్పట్ల జైపాల్(35)తో కలిసి రమేష్ తన భూమి వద్దకు వెళ్తుండగా హన్మంతు తో పాటు అతని సోదరులు, వారి భార్యలు, తల్లిదండ్రులు కలిసి రమేష్, జైపాల్‌లపై గొడ్డలితో దాడి చేయగా, జైపాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై సిర్గాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. 16 రోజుల్లోనే నిందితులందరికీ షరతులతో కూడిన బెయిల్ మంజూరుకాగా రద్దు కోసం అవతలివారు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఆగ్రహంతో శనివారం రమేష్ ఇంటికి వెళ్లిన హన్మంతు ఆయన కుటుంబ సభ్యులు రమేష్ తల్లి కుర్మ మణెమ్మను అసభ్యంగా దూషించడమే కాకుండా చంపుతామని బెదిరించి, ద్విచక్ర వాహనంతో ఢీకొట్టారు. ఈ మేరకు మణెమ్మ సిర్గాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయమై కుర్మ హనుమంతుతో పాటు అతడి కుటుంబ సభ్యులైన ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కంగ్టి సీఐ వెంకటరెడ్డి తెలిపారు.

13 నుంచి అథ్లెటిక్స్ పోటీలు

మెదక్ అర్బన్, అక్టోబరు11 (ఆంధ్రజ్యోతి): మెదక్ స్టేడియంలో ఈ నెల 13, 14 తేదీల్లో ఉమ్మడి జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు తెలిపారు. జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అండర్-14, 17 బాలబాలికలకు రన్నింగ్, త్రో బాల్, లాంగ్, హై, ట్రిపుల్ జంప్స్ తదితర పోటీలు ఉంటాయని తెలిపారు. మిగితా వివరాల కోసం 9963005540, 9553075717, 8019894424 నంబర్లను సంప్రందించాలని పేర్కొన్నారు.

హస్తవాసి ఎవరికో?

(5వ పేజీ తరువాయి)

రాష్ట్రానికి చెందిన ఈమె చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి ప్రస్తుతం ఇన్‌చార్జిగా ఉన్నారు. గతంలో త్రిపుర, నాగాలాండ్ రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాలు పర్యవేక్షించారు. ఆమె శనివారం సంగారెడ్డికి చేరుకున్నారు. ఇక సిద్దిపేట, మెదక్ జిల్లాలకు కలిపి జ్యోతి రౌటేలాను పరిశీలకురాలిగా పంపించారు. ఆలిండియా మహిళా కాంగ్రెస్ విభాగంలో ఆమె కీలక నేతగా కొనసాగుతున్నారు. ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన ఈమె ప్రస్తుతం మెదక్ జిల్లాకు వచ్చారు. ఇద్దరు కూడా పార్టీలో కరడుగట్టిన కార్యకర్తలుగా పనిచేసి పైకొచ్చిన మహిళా నేతలు కావడం విశేషం.

నేటి నుంచే సమావేశాలు.. దరఖాస్తులు

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష రేసులో ఉన్నవారి నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. నేటి నుంచి నియోజకవర్గాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేయనున్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి నేతలు, కార్యకర్తలు ఎవరైనా అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించినట్లుగా తెలుస్తోంది. దీంతో అత్యధిక సంఖ్యలో ఆశావహులు పోటీపడనున్నారు. అదే విధంగా ఆయా నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి, గత ఎన్నికల్లో సాధించిన ఓట్ల శాతం, స్థానిక ఎన్నికల్లో బలాబలాలపై కూడా సమీక్ష చేయనున్నారు. రోజుకు ఒక నియోజకవర్గం చొప్పున దాదాపు వారం రోజులపాటు సమావేశాలు నిర్వహించేందుకు స్థానిక పార్టీ నేతలు అన్ని ఏర్పాట్లు చేశారు. నేడు సంగారెడ్డి, మెదక్ జిల్లా కేంద్రాల్లో విలేకరుల సమావేశాలను సైతం ఏర్పాటు చేయనున్నారు.

ప్రేమ పేరుతో ఒకరు.. భయపెట్టి మరొకరు..

- యువతికి గర్భం.. ఇద్దరిపై కేసు

ములుగు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పెళ్లి పేరుతో ఒకరు, ఆ విషయం తెలిసి బెదిరించి మరొకరు ఆమెను లొంగదీసుకున్నారు. అయితే, ఈ విషయాన్ని దాచి ఆమెకు మరొకరితో వివాహం చేశారు. పెళ్లి అయిన 13 రోజులకే ఆమె గర్భవతి అన్న విషయం తెలిసి నిలదీయడంతో విషయం బయటపడింది. దీంతో ఇందుకు కారణమైన ఇద్దరిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ములుగు ఎస్సై విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని అదే గ్రామానికి చెందిన ఉదయ్‌కిరణ్ అనే యువకుడు ప్రేమ, పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెతో శారీరక సంబంధం పెట్టుకున్నాడు. అయితే, ఈ విషయం అదే గ్రామానికి చెందిన పవన్ కల్యాణ్ అనే యువకుడికి తెలవడంతో అతను ఆమెను బెదిరించి శారీరకంగా లొంగదీసుకున్నాడు. ఈ విషయం ఇంట్లో వారికి తెలిసినా దాచి పెట్టి ఆమెకు గత నెల 25న వివాహం చేశారు. అత్తింటికి వచ్చిన ఆ యువతికి ఈ నెల 8న కడుపునొప్పి రావడంతో తల్లిదండ్రులను పిలిపించారు. ఆమెను హాస్పిటల్‌కు తీసుకెళ్లగా, పరీక్షించిన వైద్యులు గర్భవతిగా తేల్చారు. పెళ్లి అయిన 13 రోజులకే గర్భం రావడంతో నిలదీయగా జరిగిన విషయాన్ని చెప్పింది. దీంతో యువతిని మోసం చేసిన ఇద్దరిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు.

యువకుడి ఆత్మహత్య

జోగిపేట రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసై జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని చింతకుంటలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఎస్ఐ పాండు కథనం ప్రకారం.. చింతకుంటకు చెందిన బాలరాజు(23) మద్యానికి, చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది తన పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకున్నాడు. అతను ఆత్మహత్య చేసుకుని నాలుగు రోజులైనా ఎవరూ గమనించకపోవడంతో మృతదేహం కుళ్లిన స్థితికి చేరింది. శనివారం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు విచారణ చేపట్టారు.

నర్సాపూర్‌కు గోదావరి జలాలు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన
- మంత్రి ఆదేశాలతో ప్రారంభమైన పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


పైపులైన్లకు మరమ్మతులు చేపడుతున్న అధికారులు

నర్సాపూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ నియోజకవర్గంలోని గ్రామాలకు ఒకటి రెండు రోజుల్లో గోదావరి జలాలు అందనున్నాయి. పైపులైన్ల లీకేజీ వల్ల పది రోజులుగా మంజీర నీరు నిలిచిపోయింది. ప్రత్యామ్నాయంగా శివ్వంపేటలో సంప్ నుంచి గోదావరి జలాల సరఫరాకు అవకాశమున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ఆంధ్రజ్యోతిలో రెండు రోజుల క్రితం ప్రత్యేకంగా కథనం ప్రచురితమైంది. ఈ కథనాన్ని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయగా, అధికారులు సరఫరా కోసం పనులను వేగవంతం చేశారు. పైపులైన్లను ప్రత్యేకంగా పరిశీలిస్తూ సరఫరాకు అవసరమైన మరమ్మతులు చేస్తున్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఆంధ్రజ్యోతిని స్థానికులు ప్రత్యేకంగా అభినందించారు.

'ధన్-ధాన్య కృషి యోజన' వీక్షణ


ఉద్యాన విశ్వవిద్యాలయం అధికారులు విద్యార్థులతో ఉపకులపతి దండ రాజిరెడ్డి

కొండపాక/ములుగు/జహీరాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ధన్-ధాన్య కృషి యోజన కార్యక్రమాన్ని ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల రైతు వేదికలు, ములుగులోని వ్యవసాయ వర్సిటీ విద్యార్థులు వీక్షించారు. ఈ కార్యక్రమాన్ని న్యూ ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీ శనివారం ప్రారంభించగా, వర్చ్యువల్‌గా ఇక్కడి నుంచి వీక్షించారు. సిద్దిపేట జిల్లా కొండపాక మడలం దుద్దెడ రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కొండల్ రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి కౌసల్య, ఆయిల్ ఫెడ్ అధికారి భాస్కరరెడ్డి , కొండపాక మార్కెట్ కమిటీ చైర్మన్ వి. శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ పరశురాములు, జిల్లాలోని వివిధ మండలాల వ్యవసాయ అధికారులు, పశు వైద్య అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, సిద్దిపేట కొండపాక గజ్వేల్ చేర్యాల సంబంధించిన ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ములుగులోని ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ డాక్టర్ దండ రాజిరెడ్డి, ఉద్యాన విశ్వవిద్యాలయ అధికారి డీన్ ఆఫ్ పీజీ స్టడీస్, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్ డాక్టర్ సురేష్ కుమార్, డాక్టర్ మల్లేష్, సింధుజ, సతీష్, రైతులు, విద్యార్థులు, బోధన సిబ్బంది పాల్గొన్నారు. జహీరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్, వ్యవసాయమార్కెట్ ప్రత్యేక కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఇంకా ఏడీఏ భిక్షపతి, శాస్త్రవేత్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూమి కబ్జాకు యత్నం

- అడ్డుకున్న కొల్లూరు పోలీసులు



స్థలం తమదంటూ చెబుతున్న వ్యక్తులు

రామచంద్రాపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి కొల్లూరులోని సర్వే నంబరు 188/ఏ వివాదాస్పద భూమిని కబ్జాచేసేందుకు కొందరు వ్యక్తులు విఫల యత్నం చేశారు. ఈ స్థలం తమదంటూ శ్రీకాంత్‌రెడ్డి, గిరిజరాణి, వెంకట్‌రెడ్డి, రాకేష్ తదితరులు ఓ కటౌట్‌తో ఫొటోదిగారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. శుక్రవారం ఉదయం కొందరు వ్యక్తులు వచ్చి కోర్టు పరిధిలోని వివాదస్పద భూమిలో ఇనుప షీట్లతో ఆఘమేఘాల మీద ప్రహరీ నిర్మాణానికి తెగబడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని అందరినీ అక్కడ నుంచి వెళ్లగొట్టారు. కొందర్ని పోలీస్‌స్టేషన్ తరలించారు. పోలీసులు ఘటనా స్థలం నుంచి వెళ్లడంతో కబ్జాదారులు తిరిగి అక్కడికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న సీఐ గణేష్ పటేల్ ఎస్ఐలు రమేష్, సురేష్‌లతో పాటు సిబ్బందితో కలిసి వివాదస్పద భూమి వద్ద చేరుకున్నారు. పోలీసులు అక్కడ ఉన్న కంటైనర్, ఇనుప షీట్లు, రాడ్లను పోలీస్‌స్టేషన్ వద్దకు తరలించారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిద్దిపేట రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి); 132/33 కేవి సిద్దిపేట నుంచి 33కేవి నారాయణరావుపేట ఫీడర్ మెయింటెనెన్స్ పనుల నిమిత్తం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ సిద్దిపేట రూరల్ ఏడీఈ పి.శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఆదివారం సిద్దిపేట రూరల్ తో పాటు నారాయణరావుపేట మండలాల్లోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, సిద్దిపేట రూరల్ మండలం చింతమడక, అంకంపేట, సీతరాంపల్లి, నారాయరాయణరావుపేట మండల కేంద్రంతో పాటు లక్ష్మీదేవి పల్లి, బంజేరుపల్లి, కోదండరావుపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

● **చేర్యాల:** మండలంలోని ముస్త్యాల గ్రామంలో 132/33కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాల్లో అంతరాయం ఉంటుందని ఏడీఈ వెంకట్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 5.30 నుంచి 6.30గంటల వరకు చేర్యాల పట్టణం, గుర్జకుంట, వేచరేణి, ముస్త్యాల పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మత్తుపదార్థాల నివారణకు నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు



నార్కోటిక్ తనిఖీలు చేస్తున్న పోలీసులు

హుస్నాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాల నివారణ కోసం శనివారం పోలీసులు హుస్నాబాద్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు చేశారు. పట్టణంలోని అక్కన్నపేట రోడ్డు, గాంధీరోడ్డు, కరీంనగర్‌రోడ్డు, ఎల్లమ్మ టెంపుల్ రోడ్డు, దాబాలు, కిరణాషాపులు, టీ కొట్టులను ఇతర అనుమానాస్పద ప్రాంతాలను తనిఖీ చేశారు. గంజాయి ఇతర మత్తు పదార్థాల నివారణకు ప్రజల సహకారం అవసరమన్నారు. మత్తు పదార్థాలను అమ్మినా, రవాణా చేసిన చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్ఐ లక్ష్మారెడ్డి, డాగ్ స్క్వాడ్ సిబ్బంది అజయ్ పోలీసు సిబ్బంది ఉన్నారు.

సాంకేతిక సమస్యలు సరిచేసి బిల్లులు జమ చేయండి

కొమురవెల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో కలిసి ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇల్లు మంజూరైన పలువురు లబ్ధిదారులు నిర్మాణం చేపట్టి బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. అప్పులు చేసి నిర్మాణాలు చేపట్టడం, సకాలంలో బిల్లులు అందకపోవడం తదితర కారణాల వల్ల లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే సంబంధిత అధికారులు సాంకేతిక సమస్యలను పరిష్కరించి లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమచేయాలన్నారు.

హుస్నాబాద్‌లో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆదిత్య

హుస్నాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన హుస్నాబాద్ పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. ఇక్కడి పాఠశాలలు, కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎన్నోమార్లు వినతిపత్రాలు సమర్పించినా అధికారులు ఇప్పటికీ స్పందించడం లేదన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాల భవనాలు పురాతనమైనవని, అనేక సమస్యలు నెలకొన్నాయన్నారు. నూతన భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్‌లో చిన్నపాటి వర్షానికి బురదమయం అవుతుందన్నారు. అక్కన్నపేట మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏబీవీపీ నాయకులు బీమగోని చరణ్, రాహుల్, అంజి తదితరులున్నారు.

భద్రతపై భరోసా ఏదీ?

- వరుస చోరీలతో బెంబేలెత్తుతున్న ప్రజలు
- కరువైన సీసీ కెమెరాల నిర్వహణ
- ఫిర్యాదులను పట్టించుకోకపోవడంపై అసంతృప్తి
- శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు విఫలమయ్యారని ఆరోపణలు





మద్దూరు హైస్కూల్ వద్ద పనిచేయని సీసీ కెమెరా, గ్రామ పంచాయతీలో పని చేయని సీసీ కెమెరా పరికరాలు

మద్దూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు, దూళిమిట్ట మండలాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నా శాంతి భద్రతల పర్యవేక్షణలో ముందుండాల్సిన పోలీసుశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల వరుసగా చోటు చేసుకున్న ఘటనలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు. ఒక్క సీసీ కెమెరా వంద పోలీసులకు సమానమనే మాటేమో గానీ, వంద సీసీ కెమెరాలున్నా సరైన పర్యవేక్షణ లేక అసలు నిఘాయే కరువైందని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వరుస చోరీలతో బెంబేలు

కొంత కాలంగా ఆయా గ్రామాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కాపర్ వైర్లు, వ్యవసాయ బావుల వద్ద కొట్టాలలో కట్టేసిన పశువుల అపహరణ, మేకల దొంగతనాలు, తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్‌గా చోరీలు, గ్రామ పంచాయతీ ట్రాక్టర్ వాటర్ ట్యాంకర్ టైర్లు, సెల్ టవర్‌లోని ఆయిల్ దొంగతనాలతో పాటు విద్యాలయాల్లో దొంగతనాలకు పాల్పడుతూ చాకచక్యంగా తప్పించుకుంటున్న ఘటనలు చోటు చేసుకోవడం తెలిసిందే. అంతేకాకుండా గంజాయి వినియోగంతో పాటు విక్రయాలు అప్పుడప్పుడూ బయట పడుతూనే ఉన్నాయి. నేర రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు, ప్రజలకు కమ్యూనిటీ పోలీసింగ్ వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆ శాఖ విఫలమైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

'నిఘా' పై నిర్లక్ష్యమేల?

పోలీసుల పర్యవేక్షణా లోపం, నిఘా నేత్రాల ఏర్పాటులో వైఫల్యం చర్చనీయాంశంగా మారింది. గతంలో పోలీసుశాఖ ప్రోద్బలంతో గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గ్రామంలోని ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు, గ్రామ ప్రముఖుల ద్వారా సమకూరిన ఆదాయాలతో సీసీ నిఘా ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల నిర్వాహణలో అలసత్వం ప్రదర్శించడంతో చాలా గ్రామపంచాయతీలలో సీసీ కెమెరాలు పని చేయడం లేదు. కొన్ని చోట్ల పరికరాలు మూలకు పడ్డాయి. కళాశాలల్లో సీసీ కెమెరాలున్నా రాత్రి పూట ఆఫ్ చేసి పెట్టుకోవడం లాంటి ఘటనలు వెలుగుచూస్తున్నాయి. నిఘా కరువై చోరీ ఘటనలు ఎక్కువైనట్లు ప్రచారం జరుగుతోంది. సీసీ కెమెరాల నిఘా లేక భవిష్యత్తులో ప్రభుత్వ కార్యాలయాలకు భద్రత ప్రశ్నార్థకంగా మారినట్లు సిబ్బంది ద్వారా తెలుస్తోంది.

ఫిర్యాదులను పట్టించుకోరా?

ఇటీవల ఓ గ్రామంలోని గ్రామపంచాయతీ వాటర్ ట్యాంకర్ టైర్లు చోరీకి గురయ్యాయి. ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా పోలీసులు నిరాకరించినట్లు సమాచారం. చాలా మంది ఫిర్యాదులు పరిష్కరించకుండానే వారం తర్వాత క్లోజ్ చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. బంగారానికి మెరుగులు పెడాతమంటూ కొందరు, తక్కువ ధరకే బంగారం దొరుకుతుందని మోసపోయిన కొన్ని సంఘటనలు, గ్యాస్ సిలిండర్ మంజూరైందని కొందరు గ్రామస్తులను బురిడీ కొట్టించి దండుకున్న ఘటనలున్నాయి.

నిఘాను పటిష్టం చేయాలి

మండలంలోని అన్ని గ్రామాల్లో బెల్టు షాపులు విచ్చల విడిగా నడుస్తుండటంతో యువత మద్యానికి బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నా పోలీసులు పట్టించుకున్న దాఖలాలు లేవని తెలుస్తోంది. పోలీసులు నైట్ పెట్రోలింగ్ కరువైనట్లు ఆరోపణలున్నాయి. ఏది ఏమైనా సీసీ కెమెరాల ఏర్పాటు, నిర్వహణ వంటి విషయాల్లో నిర్లక్ష్యం వీడి గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోని సీసీ కెమెరాల పరికరాలను మరమ్మతులు చేపట్టాలని పలువురు బాధితులు డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల పనితీరును మెరుగుపర్చాల్సిన అవసరముందని మండల ప్రజలు భావిస్తున్నారు.

సీజేఐపై దాడిని ఖండిస్తూ నిరసనలు



గజ్వేల్ పట్టణంలోని ర్యాలీ నిర్వహిస్తున్న ఆయా సంఘాల నాయకులు

సిద్దిపేట కల్చరల్/గజ్వేల్/చేర్యాల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : సీజేఐపై దాడికి వ్యతిరేకంగా జిల్లాలోని పలు మండలాల్లో వివిధ సంఘాలు, జేఏసీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దేశంలోని అత్యున్నత న్యాయస్థానంలో సీజేఐపై దాడి న్యాయ వ్యవస్థపైనే దాడిగా అభివర్ణించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట బీజేఆర్ భవన్‌లో (నవజీవన్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ(న్యూస్) సమావేశం ఏర్పాటు చేసి దాడిని ఖండించారు. సొసైటీ సభ్యులు నల్ల రిబ్బన్లు ధరించి నిరసనను తెలియజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మొలుగు బాలరాజు, కర్రె స్వామి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గజ్వేల్‌లోని ఆయా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సీజేఐ బీఆర్ గవాయిపై జరిగిన దాడిని ఖండిస్తూ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీటీఎఫ్ మాజీ అధ్యక్షుడు రాంచంద్రం, సుంచు నరేందర్, పంబాల ఎల్లయ్య, రాజులు, సత్యనారాయణ, వలీఅహ్మద్, సత్యనారాయణ, అటకూరి రాములు, కిష్టయ్య, కృష్ణ, చిప్పల యాదగిరి, పొన్నాల కుమార్, దాసరి ఏగొండస్వామి, నందబోయిన ఎల్లయ్య, నిరుడి స్వామి, యాదగిరి, వేణు, మహేశ్, చందు, వెంకటేశం, రాజేశం, శివ, ప్రశాంత్, ఖాసీం, ప్రవీణ్ తదితరులున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐ, సీపీఎం,ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం చేర్యాలలో నిర్వహించిన సమావేశంలో అందె అశోక్, కొంగరి వెంకట్‌మావో, సనవాల ప్రసాద్, గూడెపు సుదర్శన్, ఆత్మకూరి హరికృష్ణ, ఐలయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మహాసభలో మున్సిపల్ కార్మికులతో సీఐటీయూ నాయకులు

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి పేర్కొన్నారు. శనివారం సిద్దిపేటలో మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) జిల్లా 4వ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించి సభలను ప్రారంభించారు. సభలో గోపాలస్వామి మాట్లాడుతూ... కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం రూ.10 లక్షలు కల్పించాలంటూ పలు డిమాండ్లు చేశారు. మున్సిపల్ కార్మికులకు గత ప్రభుత్వాలు అనుసరించిన విధానాల మూలంగా వారి జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదని నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసి విస్మరించిందన్నారు.

అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కాముని గోపాలస్వామి, అధ్యక్షుడిగా గుర్రం నరసింహులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొండేటి సతీష్, ప్రధాన కార్యదర్శిగా చొప్పరి రవికుమార్, కోశాధికారిగా గడి మల్ల వినోద, ఉపాధ్యక్షుడిగా డబ్బెట రాజయ్య, గ్యాదరి మహేష్, కనక లక్ష్మి, బూరుగు రవి, ఎలుకపల్లి దుర్గ, సహాయ కార్యదర్శులుగా గడ్డం సత్యం, ఐలేని రాజయ్య, జై విజయలక్ష్మి, అసక నరసింహులు, కమిటీ సభ్యులుగా కవిత, లత, బాలవ్వ, గడిపే ప్రశాంత్, తైదల రాజేశ్వరి, యాదమ్మ, బి.సురేష్ లతోపాటు మరో 8 మందిని కోఆప్షన్ సభ్యులతో కమిటీని ఎన్నుకున్నట్లు గోపాలస్వామి తెలిపారు.

హాస్టల్ వర్కర్స్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి



మీర్జాపూర్ గిరిజన ఆశ్రమపాఠశాల వద్ద సమ్మె చేస్తున్న వర్కర్లతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత మల్లిఖార్జున్‌రెడ్డి

హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాల హాస్టల్‌లో డెయిలీవైజ్ వర్కర్స్‌గా పనిచేస్తున్న కార్మికుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండలం మీర్జాపూర్ గిరిజన ఆశ్రమపాఠశాల ముందు డెయిలీ వైజ్ వర్కర్స్ యూనియన్(జేఏసీ) ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మెకు మల్లిఖార్జున్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత నెల రోజులుగా డెయిలీవైజ్ వర్కర్స్ నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. వారికి చెల్లించాల్సిన వేతనాలు కూడా పెండింగ్‌లో పెట్టడంతో వర్కర్లు ఇబ్బందుల పాలవుతున్నారన్నారు. వారిని పర్మినెంట్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

బీసీలకు రిజర్వేషన్ ప్రకటించాకే ఎన్నికలు నిర్వహించాలి



తొగుటలో మాట్లాడుతున్న బీసీ సంఘాల నాయకులు

తొగుట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ ప్రకటించాకే ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నర్సింహులు యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం తొగుటలో అఖిలపక్ష పార్టీల బీసీ సంఘాల నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఎన్నికలు ఆలస్యం కావడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటు పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే ఇచ్చిన మాట ప్రకారం ఎన్నికలు జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. బీసీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 13న సిద్దిపేట జిల్లా బంద్‌కు పిలుపునిస్తున్నట్లు తెలిపారు. బంద్‌లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో తొగుట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొమురయ్య, తొగుట కోఆపరేటివ్ సొసైటీ వైస్ చైర్మన్ కుర్మ యాదగిరి, మాజీ సర్పంచ్‌లు సిరినేని గోవర్ధన్, చిక్కుడు చంద్రం ముదిరాజ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల అమలు కోసం కలసిరాని పార్టీలకు పుట్టగతులుండవు

గజ్వేల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ అమలు కోసం కలసిరాని పార్టీలకు పుట్టగతులుండవని తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి అన్నారు. గజ్వేల్ పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు విద్యా, ఉద్యోగ నియామకాల్లో కలసిరాని రాజకీయ పార్టీలకు భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందన్నారు. బీసీల జీవితాలతో చెలగాటమాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. బడుగు, బలహీనవర్గాల అభివృద్ధిని అడ్డుకుంటున్న రాజకీయ పార్టీలకు తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు.

బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవడం తగదు

కొమురవెల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బీసీలకు జనాభా ప్రాతిపదికన స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఇచ్చిన జీవోపై కొందరు కోర్టుకు వెళ్లడం బాధాకరమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రతి బీసీ బిడ్డ 42 శాతం రిజర్వేషన్లు సాధించుకోవడానికి ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని పార్టీల సభ్యుల మద్దతుతో ఏకగ్రీవంగా ఆమోదించిన బీసీ బిల్లును కేంద్ర ప్రభుత్వం గవర్నర్ దగ్గర పెండింగ్‌లో పెట్టించిందని విమర్శించారు.

విద్యార్థి మృతిపై విచారణ జరిపించాలి



బక్కి వెంకటయ్యకు వినతిపత్రాన్ని అందజేస్తున్న వివిధ దళిత సంఘాల నాయకులు

మిరుదొడ్డి,అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ జిల్లెలగడ్డ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సనాదుల వివేక్ అనుమానాస్పదంగా మృతి చెందిన విషయం తెలిసిందే. విద్యార్థి మృతిపట్ల సమగ్ర విచారణ జరిపించాలంటూ శనివారం అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య నివాసంలో జాతీయ మాలమహానాడు రాష్ట్ర పొలిట్‌బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు నర్సింగరావు, రమేష్, కనకయ్య, రాములు, సన్నీ, రాకేష్, కళ్యాణ్ తదితరులున్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

ములుగు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల వల్ల జరిగే అనర్థాలపై వ్యాపారులు, ప్రజలు మహిళలు జాగ్రత్తగా ఉండాలని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ములుగు మండలం వంటిమామిడి మార్కెట్ కార్యాలయం వద్ద షీ టీం ద్వారా వ్యాపారులు, మహిళలు, ప్రజల రక్షణకు ఉన్న చట్టాల గురించి వివరించారు. సైబర్ నేరాల వల్ల అనర్థాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సామాజిక రుగ్మతల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రతకు ఎల్లవేళలా పోలీసులు అందుబాటులో ఉంటారన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో షీ టీం సభ్యులు ప్రజలు ఉన్నారు.

లోకకల్యాణానికి సాంస్కృతిక సంప్రదాయాలు



నాభిశిల మహోత్సవంలో మెదక్ పార్లమెంటు సభ్యులు రఘునందన్‌రావు

దుబ్బాక, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ సాంస్కృతిక సంప్రదాయాలు, ఆచారాలు లోక కల్యాణానికి దోహదపడాలని మెదక్ పార్లమెంటు సభ్యుడు మాధవనేని రఘునందన్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి ఆకాంక్షించారు. శనివారం దుబ్బాకలో ఏర్పాటు చేసిన నాభిశిల పునఃప్రతిష్ఠాపనోత్సవంలో ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు, ప్రముఖులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

సులభ గణిత పద్ధతులను రూపొందించుకోవాలి



పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు సన్మానం

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు గణితం సులభంగా అర్థమయ్యేవిధంగా గణిత ఉపాధ్యాయులు బోధనా పద్ధతులు రూపొందించుకోవాలని తెలంగాణ గణిత ఫోరం(టీఎంఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కందికొండ శ్రీనివాస్ సూచించారు. టీఎంఎఫ్ సిద్దిపేట జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం శనివారం సిద్దిపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగింది. తెలంగాణ గణిత ఫోరం సిద్దిపేట జిల్లా శాఖ సమావేశం జిల్లా అధ్యక్షుడు వంటేరు సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన, జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి పొందిన గణిత ఉపాధ్యాయులకూ, గణిత స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా టీఎంఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ గణితంలో రాణించిన విద్యార్థి మిగిలిన అన్ని సబ్జెక్టులలో ప్రతిభ కనబరుస్తారని తెలిపారు. కార్యక్రమంలో టీఎంఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పన్యాల అశోక్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అజయ్‌కుమార్‌రెడ్డి, సిద్దిపేట జిల్లాశాఖ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి వెంకటేశ్వర్, వివిధ మండలాల తెలంగాణ గణిత ఫోరం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలి



గురుకులంలో వంటలను పరిశీలిస్తున్న గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి

హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 11 (ఆంధ్ర జ్యోతి): సాంఘిక సంక్షేమశాఖ గురుకుల విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ బోధించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి పేర్కొన్నారు. శనివారం జిల్లెలగడ్డ సాంఘిక సంక్షేమశాఖ బాలుర గురుకుల పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం, టిఫిన్స్ అందిస్తున్నరా లేదా అని ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు.ఈ నెల 7న పాఠశాలలో విద్యార్థి వివేక్ మృతి సంఘటన పట్ల విచారం వ్యక్తం చేశారు. పిల్లల క్రమశిక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన బాధ్యత ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులపై ఉందన్నారు. కొందరు విద్యార్థులు రాత్రి సమయంలో గేటు దాటి బయటకు వస్తున్నట్లు తెలిసిందని, ప్రిన్సిపాల్ ప్రత్యేక చొరవ తీసుకుని వారి ప్రవర్తన మార్చాలని సూచించారు. పాఠశాలలో వసతి సౌకర్యాలు కొరవడితే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. ఆయన వెంట నాయకులు వెన్న రాజు,రమేష్‌నాయక్, మహేందర్, రాజ్‌కుమార్ ఉన్నారు.

రైతుల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం

సిద్దిపేట కలెక్టరేట్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం, పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మొద్దు నిద్రలో ఉందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మచ్చ వేణుగోపాల్ రెడ్డి విమర్శించారు. సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న రైతులు పంట అమ్ముకోవడానికి 20 రోజులుగా పడిగాపులు కాస్తున్నారన్నారు. శనివారం సిద్దిపేట మార్కెట్‌యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు రైతులతో కలిసి ఆందోళన చేపట్టారు. మొక్కజొన్న రైతులు పడుతున్న ఇబ్బందులను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు.రెండు రోజుల్లో కొనుగోలు ప్రారంభించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.

నష్టపోయిన పత్తి రైతులను ఆదుకోవాలి



అల్లిరాజపేట్‌లో పత్తిపంటను పరిశీలిస్తున్న ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నష్టపోయిన పత్తి రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని అల్లిరాజపేట్ గ్రామంలో రైతులు సాగుచేసిన పత్తి పంటను ప్రతాప్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అలీ రాజాపేట గ్రామంలో ఇద్దరు రైతులు దాదాపు 15 ఎకరాలు భూమిని కౌలుకు తీసుకొని సుమారు 8 లక్షల వరకు ఖర్చు చేస్తే, సకాలంలో యూరియా అందక, అకాల వర్షాల వల్ల పత్తి పంట ఎదగకపోవడంతో ఎకరానికి రూ.50వేల వరకు నష్టం వాటిల్లిందన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా పత్తి పంట నష్టపోయిన రైతాంగానికి ఎకరానికి రూ.50వేల నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గజ్వేల్ నియోజకవర్గంలో 25 వరకు పత్తి మిల్లులు ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం ఒక్క సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించకపోవడం దారుణమన్నారు. వెంటనే సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నేతాజీ విగ్రహానికి ఆదరణ ఏదీ?



ఇర్కోడు గ్రామ ఫంక్షన్‌హాల్ వద్ద ఓ మూలన పెట్టిన నేతాజీ విగ్రహం

సిద్దిపేట రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యంతో సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు గ్రామంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి ఆదరణ లేకుండా పోయింది. ఎన్‌హెచ్765 డీజీ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా నేతాజీ విగ్రహాన్ని ఏడాది క్రితం జాతీయ రహదారి విస్తరణ అధికారులు తొలగించి గ్రామ ఫంక్షన్ హాల్ సమీపంలో ఓ మూలన పడేశారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తయినప్పటికీ నేతాజీ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాల్సిన అధికారులు మిన్నకుండిపోయారు. మహనీయుల విగ్రహాల నిర్వహణకు ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం మూలంగా బేఖాతరవుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా నేతాజీ విగ్రహానికి ప్రాధాన్యతనిస్తూ, బాధ్యతరహిత్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.